క్లుప్తంగా

రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలి



శాయంపేట : పంటసాగులో రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని ఏఓ గంగాజమున సూచించారు. మండలంలోని హుస్సేన్‌పల్లి గ్రామంలో పత్తి పంటలో తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడారు. రైతులు పత్తి పంటసాగులో సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులు పొందాలన్నారు. అలాగే రైతులందరూ పత్తి పంటలో అంతర పంటలు, రక్షక పంటలు సాగుచేయాలని, రసం పీల్చు పురుగు నివారణకు అట్టముక్కలు, కాయ తొలుచు పురుగు ఉనికిని తెలుసుకునేందుకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం 8మంది రైతుల పత్తి క్షేత్రాలను పరిశీలించారు. ఫీల్డ్ ఫెసిలిటేటర్ భానుమతి, పాల్గొన్నారు.

మోటార్లకు ఆటోమెటిక్ స్టార్టర్లు బిగించొద్దు

నర్సంపేట రూరల్ : రైతులు వ్యవసాయ భూముల వద్ద మోటార్లకు ఆటోమెటిక్ స్టార్టర్లు బిగించొద్దని విద్యుత్ శాఖ సేఫ్టీ అధికారి, డీఈ ఆనందం కోరారు. నర్సంపేట మండలంలోని ముత్తోజిపేట, రాజుపేట గ్రామాల్లో విద్యుత్ ప్రమాదాల నివారణపై శనివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం చోటు చేసుకుంటే అధికారులకు, సిబ్బందికి సమాచారం అందించాలని చెప్పారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



దుగ్గొండి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండలంలోని గుడ్డెలుగులపల్లిలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో పేదలకు కలిగిన ప్రయోజనం ఏమీ లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు చుక్క రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింగరావు, గ్రామ క్లస్టర్ ఇన్‌చార్జ్ బొల్లేపల్లి రాము, మట్ట రాజు, అమ్మ రోహిత్, కూరతోట సురేశ్, జంగిలి రవి, నగేశ్, తొర్రూరు రవి, తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు శాశ్వత వసతి కల్పించాలి

నర్సంపేట : పట్టణంలో పండ్లు, కూరగాయలు, ఇతర సరుకులు అమ్ముకునే చిరువ్యాపారులకు శాశ్వత ప్రాతిపదికన వసతి కల్పించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం మున్సిపల్ అధికారులకు శనివారం వినతిపత్రం అందజేసింది. అనంతరం సందీప్ మాట్లాడారు. బస్టాండ్ ఎదుట ఉన్న పండ్ల వ్యాపారుల షాపులను కోర్టు ప్రహరీని 10 ఫీట్లు వెనక్కి జరపాలని లేదా నిరుపయోగంగా ఉన్న అగ్రికల్చర్ గోదాముల సమీపంలోని మార్చాలని, తదితర సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు జూలూరి మనీశ్ గౌడ్, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, సీనియర్ నాయకులు ఠాకూర్ శివరంజన్ సింగ్, పట్టణ ఉపాధ్యక్షులు కాసుల నాగేంద్ర బాబు, ఠాకూర్ విజయ్‌సింగ్, కందకట్ల నాగరాజు, జిల్లా కార్యదర్శి చేను నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

7 వేల మందికి పీఎం కిసాన్ మంజూరు

గీసుకొండ : మండలంలోని 7079 మంది రైతులకు పీఎం కిసాన్ యోజన కింద రూ.2 వేల చొప్పున సాయం మంజూరైందని మండల స్పెషల్ ఆఫీసర్ సురేశ్ కుమార్, వ్యవసాయ శాఖ ఏఓ హరిప్రసాద్ బాబు తెలిపారు. మండలంలోని కోనాయమాకుల రైతువేదికలో శనివారం ఏర్పాటు చేసిన ప్రధాని మోదీ సందేశ వీక్షణ కార్యక్రమం సందర్భంగా ప్రత్యేక అధికారి సురేశ్, ఏఓ హరిప్రసాద్ మాట్లాడారు.

దూరవిద్యను వినియోగించుకోవాలి

గీసుకొండ : కేయూ దూర విద్య అవకాశాలను అర్హులు వినియోగించుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పాక శ్రీనివాస్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో కేయూ ఓపెన్ డిగ్రీ, పీజీ కోర్సుల ప్రవేశాల నోటిఫికేషన్ల కరపత్రాలను శనివారం విడుదల చేసి మాట్లాడారు.

ప్రజల చూపు హోమియోపతి వైపు

- వేలేరు పీహెచ్‌సీలో 2008లో ప్రారంభం
- పలు రకాల వ్యాధులకు చికిత్స
- పెరుగుతున్న పేషెంట్ల సంఖ్య



వేలేరు హోమియోపతి వైద్యశాలలో అందుబాటులో ఉన్న మందులు

వేలేరు : వైద్యశాస్త్రంలోని వివిధ వ్యాధులకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. వీటిలో హోమియోపతి వైద్యం ఒకటి. దీనిని నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ద్వారా వేలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 2008లో ప్రారంభించారు. అయితే ప్రభుత్వ భవనాలు అందుబాటులో లేకపోవడంతో ఆరోగ్య కేంద్రంలోని ఒక గదిని కేటాయించారు. అప్పటి నుంచి హోమియోపతి వైద్యసేవలను పీహెచ్‌సీ నుంచే మండల ప్రజలకు అందుతున్నాయి. దీంతో మండలంలోని 14 గ్రామాల ప్రజలే కాకుండా ధర్మసాగర్, భీమదేవరపల్లి మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు హోమియోపతి చికిత్స పొందుతున్నారు. గతంలో రోజుకు ఐదు నుంచి పది మంది మాత్రమే హోమియోపతి వైద్యం కోసం వస్తుండేవారని, కొంతకాలంగా రోగుల సంఖ్య 30నుంచి 40కి పెరిగినట్లు హోమియోపతి వైద్యురాలు డాక్టర్ మమత పేర్కొన్నారు. హోమియోపతి చికిత్సల్లో కీళ్లవాతం, పక్షవాతం, తెల్లమచ్చలు, అర్షమొలలు, అలెర్జీ, జుట్టు రాలడం, సోరి మచ్చలు, హిమరైస్, డయాబెటిస్, స్త్రీలలో గర్భసంచి వాపు, తెల్లబట్ట సమస్యలు, కిడ్నీల్లో రాళ్ల వంటి పలురకాల వ్యాధులకు మెరుగైన వైద్యం, మందులు అందుబాటులో ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. రోగులకు వ్యాధి లక్షణాల ఆధారంగానే హోమియోపతి వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ చికిత్స విధానంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు అంటూ ఏమి ఉండవని, అలాగే హోమియోపతి మందులు వాడటం వలన ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు కూడా ఉండవని అంటున్నారు. అందుకే ప్రభుత్వం ఈ వైద్యాన్ని ప్రజలకు ఉచితంగా అందిస్తున్నట్లు వైద్యాధికారులు వెల్లడించారు.

కీళ్ల నొప్పులు తగ్గాయి



నేను కొన్నేళ్లుగా కీళ్ల నొప్పులతో బాధపడుతుండేవాడిని. వివిధ ఆస్పత్రులకు వెళ్లి వైద్యం పొందినా నయం కాలేదు. మండల కేంద్రంలో హోమియోపతి వైద్యం అందుబాటులోకి వచ్చిందని తెలిసింది. వేలేరులోని ప్రభుత్వ దవాఖానాకు కొన్ని నెలల క్రితం వెళ్తే డాక్టర్ హోమియోపతి మందులు ఇచ్చారు. ఆ మందులు వాడటం ద్వారా కీళ్ల నొప్పులు తగ్గాయి. వాటిని క్రమం తప్పకుండా వాడుతున్నాను. ప్రస్తుతం కీళ్ల నొప్పులు తగ్గాయి.

- పి. ప్రభుదాస్, దేవునూరు

మెరుగైన వైద్యం అందిస్తున్నాం



హోమియోపతి వైద్యం కోసం వచ్చేవారికి మెరుగైన వైద్యం అందిస్తున్నాం. స్థానిక హోమియోపతి వైద్యశాలలో మూడు వందల రకాలకు పైగా మందులు అందుబాటులో ఉన్నాయి. గతంలో రోజుకు ఐదు నుంచి పది మంది వరకు మాత్రమే పేషెంట్లు వచ్చేవారు. కొంత కాలంగా సంఖ్య పెరిగింది. చర్మవ్యాధులు, కిడ్నీల్లో రాళ్లు వచ్చినవారు, కీళ్ల వాతం ఉన్నవారు ఎక్కవగా హోమియోపతి చికిత్స చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

- మమత, హోమియోపతి వైద్యురాలు, వేలేరు

దుష్ప్రచారం చేస్తే సహించేదిలేదు



మాట్లాడుతున్న శంకర్

శాయంపేట : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ కొప్పుల గ్రామశాఖ అధ్యక్షుడు ఏరుకొండ శంకర్ హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు రోజుకు 18 గంటలు ప్రజాసేవకు అంకితమవుతున్నారని అన్నారు. ఎమ్మెల్యేకు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్ని కుట్రలు చేసినా స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, రాంరెడ్డి, వంశీ, రవీందర్, భాస్కర్, రవి, ప్రవీణ్, శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతులుగా ఎదగాలి



కమలాపూర్ : చదువుకు పేదరికం అడ్డుకాదని, పేదరికంలో నుంచి వచ్చిన విద్యార్థులు ఉన్నతులుగా ఎదిగి సమాజానికి మార్గదర్శకంగా నిలవాలని ఎంపీడీఓ గుండె బాబు అన్నారు. పేద విద్యార్థుల చదువు కోసమే ప్రభుత్వం వసతి గృహాలను నెలకొల్పిందన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను శనివారం రాత్రి ఆయన సందర్శించి హాస్టల్‌లోని ఆహార నాణ్యతను, ఆహార సామగ్రిని, పరిసరాలను పరిశీలించారు. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులతో మాట్లాడి వారి కుటుంబ వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి అక్కడే రాత్రి భోజనం చేశారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. పదో తరగతి విద్యార్థులు ప్రత్యేక తరగతులను వినియోగించుకోవాలని అన్నారు. అనంతరం హాస్టల్‌లో రాత్రి బస చేసి నిద్రించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రాజన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- మండల స్పెషల్ ఆఫీసర్ జయంతి



విద్యార్థులతో మాట్లాడుతున్న జయంతి

శాయంపేట : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని మండల స్పెషల్ ఆఫీసర్ జయంతి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఇంటింటికి తిరుగుతూ పరిసరాల పరిశుభ్రతపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. బాలికల వసతి గృహానికి వెళ్తున్న విద్యార్థినులతో మాట్లాడారు. మలేరియా, డెంగీ, ప్రబలే అవకాశం ఉన్నందున పరిశుభ్రత పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలని, జ్వరం వస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని సూచించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎంపీడీఓ ఫణిచంద్ర, పంచాయతీ కార్యదర్శి రత్నాకర్, అంగన్‌వాడీ టీచర్ శ్వేత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు విద్యార్థినుల ఎంపిక



ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్‌లో గల ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ఎంజేపీ సొసైటీ నిర్వహించిన స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అనిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి విద్యార్థులు హాసిని, హరిణి, హర్షిత, హరిప్రియ ఉత్తమ ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. ఉపాధ్యాయినులు చంద్రకళ, సీమ, జ్యోతి అభినందించినట్లు తెలిపారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి 'పింగిళి'



పింగిళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

పరకాల : బహుముఖ ప్రజ్ఞాశాలి, అంకితభావం కలిగిన స్వాతంత్ర్య సమరయోధుడు జాతీయ జెండా రూపకర్త పింగిళి వెంకయ్య అని కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బొచ్చు చందర్ అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో పింగిళి వెంకయ్య జయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం చందర్ మాట్లాడుతూ.. పింగిళి వెంకయ్య దేశ కోసం చేసిన ఉద్యమాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. దేశభక్తిని పెంపొందించే జాతీయ జెండాను తయారుచేసి కోట్ల మంది ప్రజల గుండెల్లో నిలిచిన మహనీయుడు పింగిళి వెంకయ్య అని కొనియాడారు. లక్ష్మీపురం కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజు, కాంగ్రెస్ సేవదల్ జిల్లా ఉపాధ్యక్షుడు బాలరాజ్, కొమురయ్య, భాస్కర్, సాంబయ్య, కొమురయ్య, రాజయ్య, భద్రయ్య, రాజన్న, సమ్మయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

దామెర : మండలంలోని సింగరాజుపల్లి గ్రామానికి చెందిన ఆకుతోట రామచంద్రు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు కాళీప్రసాదరావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతికి గల కారణాలు తెలుసుకుని, ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఆయన వెంట ఆ పార్టీ మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్‌కుమార్, మాజీ మండల అధ్యక్షుడు నాగరాజు, నాయకులు సూర చందర్, గన్ను సతీశ్, ఉప్పుల శ్రీనివాస్, చుక్క మహేందర్, రాజుతో పాటు తదితరులు ఉన్నారు.

పీఆర్టీయూతోనే సమస్యల పరిష్కారం

- ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి



సభ్యత్వం అందజేస్తున్న తిరుపతిరెడ్డి

ధర్మసాగర్ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే పీఆర్టీయూ (టీఎస్) సంఘం ఎజెండా అని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మందల తిరుపతిరెడ్డి అన్నారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు ప్రభాకర్డి, ప్రధాన కార్యదర్శి జాన్‌సింగ్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని పీఎస్, హైస్కూల్ (బాలికలు), పీఎస్, హైస్కూల్ (బాలురు), యూపీఎస్ ఎలుకుర్తి, పీఎస్ ముప్పారం (వడ్డెర కాలనీ), పీఎస్, హైస్కూల్ దేవునూరు, కేజీబీవీ ధర్మసాగర్ పాఠశాలలను వారు సందర్శించి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. అన్ని క్యాడర్ల ఉపాధ్యాయుల ప్రమోషన్లకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి చొరవతో విడుదలైందన్నారు. పెండింగ్ బిల్లులు, 2003 ఉపాధ్యాయులకు సీపీఎల్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమారస్వామి, వల్యానాయక్, జిల్లా సహ అధ్యక్షులు సరస్వతి, సంపత్, మండలశాఖ సహ అధ్యక్షులు శ్రీనివాస్ ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు 'బిగ్‌హెల్ప్' చేయూత



నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న దాతలు

వేలేరు : చదువుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బిగ్ హెల్ప్ సంస్థ ప్రతినిధులు ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. వేలేరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కూరపాటి సారికకు రూ.3వేలు, గుగులోతు శ్రీసాయికి రూ.2వేలు, అలాగే రూ.6,7,8,9 తరగతుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సహకంగా వెయ్యి చొప్పున అందజేశారు. అలాగే వేలేరుకు చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం గొరిశెట్టి రాజన్న, గొరిశెట్టి వెంకటేశ్వర్లు పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వెండి పథకాలతో సన్మానించారు. అలాగే గతంలో ఇదే పాఠశాలలో పనిచేసిన నేతాని ప్రేమ్‌చంద్ తన తల్లి జ్ఞాపకార్థం సారిక, శ్రీసాయిలకు చేరో రూ.2500 ప్రోత్సహకంగా అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు జ్ఞానేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ సమావేశం



ఐనవోలు : మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామి గార్డెన్‌లో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ మోహన్ తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ తీసుకోనున్న నిర్ణయాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సన్నాహక సమావేశానికి కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సన్నాహక సమావేశానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరుకానున్నట్లు తెలిపారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చందర్‌రావు, మండల ఇన్‌చార్జ్ గోపాల్‌రావు, స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ రాంమూర్తి, కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నా మాట వినండి.. అంతా సెట్ చేస్తా

- అసంతృప్తులకు మార్నేని బుజ్జగింపు..?

ఐనవోలు : అధికార పార్టీని వదిలి బీఆర్ఎస్‌లో చేరుతామని సంకేతాలు ఇచ్చిన పలువురు నాయకులను టీజీ క్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు శనివారం బుజ్జగించినట్లు తెలిసింది. మండలంలోని నందనం గ్రామానికి హుటాహుటిన వచ్చిన ఆయన.. అసంతృప్తితో ఉన్న నాయకులతో సమావేశమై కారణాలను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. సమస్యలన్నీ పరిష్కారమవుతాయని పది రోజుల సమయం ఇవ్వాలని అసంతృప్తి నాయకులను కోరినట్లు తెలిసింది. అయితే పార్టీలో ఇమడలేకపోతున్నామని, అడుగడుగున అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. తాము రాజకీయంగా ఉనికి కోల్పోవడమే కాకుండా ప్రతి అంశంలో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వాపోయినట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే తమ సమస్యను పరిష్కరించాలని మార్నేనితో అన్నట్లు తెలిసింది. కాగా ఇప్పటికే సదరు నాయకులతో బీఆర్ఎస్‌కు చెందిన ఓ మాజీ మంత్రి టచ్‌లో ఉన్నారని, ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ కండువా కప్పుకోవడానికి సదరు నాయకులు సిద్ధం అయినట్లు సమాచారం. అయితే మార్నేని బుజ్జగింపులతో తాత్కాలికంగా బ్రేక్ పడుతుందా? అనే చర్చ మండలంలో జోరుగా జరుగుతోంది.

సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయాలి



ముస్త్యాలపల్లిలో మాట్లాడుతున్న రవికుమార్

దామెర : ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాగర్జన సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు గోవిందు రవికుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని ముస్త్యాలపల్లిలో శనివారం పింఛన్‌దారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన విధంగా వృద్ధులకు, ఒంటరి మహిళలకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6000 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 13వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన మహాగర్జనకు పింఛన్‌దారులు తరలిరావాలని పిలుపునిచ్చారు. అలాగే ఈనెల 7వ తేదీన హనుమకొండలో సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూర్యకిరణ్, వీరనర్సు, ఇమ్మానియల్, రమేశ్, కట్టయ్య, రాజు, వీరస్వామి, రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేస్తే సమాజంలో గుర్తింపు

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి



ఏపీఎం శ్రీధర్‌రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

శాయంపేట : ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధతతో పనిచేస్తే ప్రజల మన్ననలు పొందుతారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సురేఖ మండల సమాఖ్య ఏపీఎం శ్రీధర్‌రెడ్డి బదిలీ అవడంతో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సహజమని, మండలంలో సుదీర్ఘకాలం పనిచేసిన శ్రీధర్‌రెడ్డి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిందం రవి, చింతల రవిపాల్, రాజేందర్, వరదరాజు, ఐలయ్య, రాజ్‌కుమార్, కట్టయ్య, చిరంజీవితో పాటు తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల సన్మానం

బదిలీపై వెళ్తున్న ఏపీఎం శ్రీధర్‌రెడ్డిని మండల కేంద్రంలోని సురేఖ మండల సమాఖ్య వీఓఏలు శనివారం ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సర్దార్ పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

వేలేరు : గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కేజీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో శనివారం సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలు, అమరుల యాది, గీత కార్మికుల చైతన్య యాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గీత కార్మికులు చైతన్యవంతులై హక్కులను సాధించుకోవాలని అన్నారు. ఆగస్టు 2 నుంచి 18 వరకు సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా ఆయా గ్రామాల్లో, మండల కేంద్రాల్లో చైతన్య యాత్రలు, పాపన్న జయంతి ఉత్సవాలను నిర్వహిస్తూ, గీత కార్మిక సంఘం జెండాలను ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు కూమార్, గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గడ్డం వీరన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సంపత్, మాజీ సర్పంచ్ మల్లికార్జున్, కేజీకేఎస్ సోషల్ మీడియా కో కన్వీనర్ వెంకటేష్, కుమారస్వామి, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

- ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి

ఆత్మకూరు : తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. తల్లిపాలతో బిడ్డకు తల్లికి అనుబంధం పెరుగుతుందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు. బిడ్డ ఆరోగ్యంపై దృష్టిపెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్వేత, అంగన్‌వాడీ టీచర్లు పెరుమాండ్ల దేవమ్మ, పుష్పలీల, పద్మ, సులోచన, కరుణ, వాణి, శ్రీవిద్య, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్టేషనరీ కిట్ల పంపిణీ



కిట్లతో విద్యార్థులు, సీఐ సంతోశ్

ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు స్టేషనరీ కిట్లు (బ్యాగు, నోట్ బుక్కులు, స్టేషనరీ)ని శనివారం పోరెడ్డి రమాదేవి జ్ఞాపకార్థం ఆమె కుమారుడు పోరెడ్డి ప్రదీప్‌రెడ్డి అందిచగా సీఐ సంతోశ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. యువత సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమాదేవి, పంచాయతీ కార్యదర్శి క్రాంతి, సమ్మిరెడ్డి, భిక్షపతి, సునీల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దినేష్, దిలీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.